
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 24 । నవంబర్ । 2023



సోమశిలలో 29.27 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 29.27 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 159 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.63,250
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,680
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,850
నవర (8 గ్రాములు)	రూ.46,800

వాతావరణం

గరిష్టం/కనిష్టం
26.8 /23.9

గాలిలో తేమ 95 శాతంగా గురువారం నమోదైంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు శుక్రవారం పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

‘ఆడుదాం.. ఆంధ్రా’కు 27 నుంచి రిజిస్ట్రేషన్లు



స్పోర్ట్స్ కిట్లను పరిశీలిస్తున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం.. ఆంధ్రా పోటీలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఈ నెల 27న ప్రారంభంకానుందని టోర్నీ నోడల్ ఆఫీసర్, జేసీ కూర్మనాథ్ పేర్కొన్నారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ద్వారా జిల్లాకు అందజేసిన స్పోర్ట్స్ కిట్లను ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి సచివాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభంకానుందని తెలిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలను డిసెంబర్ 15 నుంచి నిర్వహించనున్నారని వెల్లడించారు. 15 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ పోటీల్లో పాల్గొనవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సెట్నెల్, డీఎస్‌ఏ సీఈఓ నాగరాజకుమారి, చీఫ్ కోచ్ యతిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వాలో యాంటీబయోటిక్స్ వినియోగాన్ని తగ్గించాలి



మాట్లాడుతున్న మనోజ్‌కుమార్

ఇందుకూరుపేట: ఆక్వా సాగులో యాంటీబయోటిక్స్ వినియోగాన్ని రైతులు పూర్తిగా తగ్గించాలని జాతీయ సుస్థిర జలకృషి కేంద్ర (నాక్సా) సీఈఓ డాక్టర్ మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్సీ(ఏఎంఆర్)పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మండలంలోని రాముడుపాళెం పల్లిపాళెం గ్రామంలో నాక్సా, ఎంపెడా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రొయ్యలు, చేపల సాగులో వ్యాధుల నివారణ, చికిత్సకు యాంటీబయోటిక్స్‌ను విస్తృతంగా వినియోగిస్తున్నారని తెలిపారు. దీన్ని నిరోధించే విషయంలో రైతుల్లో చైతన్యం పెరగాలన్నారు. బయోసెక్యూరిటీ పద్ధతులను పాటిస్తే ఆక్వా సాగు లాభసాటిగా ఉంటుందన్నారు. దేశంలోని తీర ప్రాంతాల్లో మొత్తం 16 ప్రచార సదస్సులను నిర్వహిస్తుండగా, ఏపీలో అధికంగా పది వరకు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట కో ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ముత్తుకూరు మత్స్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఫిషరీస్ ఏడీ రంగనాథ్ బాబు, రీజినల్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, స్టేట్ కోఆర్డినేటర్ కిరణ్, వెటర్నరీ డాక్టర్ అక్తర్, కుడితిపాళెం సర్పంచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మెకనైజ్డ్ బోటు ద్వారా గస్తీ

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సంబంధించిన తీర ప్రాంతాల మత్స్యకారులకు పొరుగు రాష్ట్రం నుంచి ఇబ్బందుల్లేకుండా మెకనైజ్డ్ బోటు ద్వారా గస్తీని నిర్వహించనున్నారని జిల్లా మత్స్యశాఖ అధికారి నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని సముద్రం మార్గం ద్వారా తమిళనాడు నుంచి పలువురు అక్రమంగా వచ్చి చేపల వేట సాగిస్తున్నారని పలు ఫిర్యాదులు అందాయన్నారు. ఈ క్రమంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్, ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, మానుగుంట మహీధర్‌రెడ్డి, ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు చొరవతో సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. తక్షణమే స్పందించిన మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు కాకినాడ నుంచి మెకనైజ్డ్ బోటును ఇక్కడికి కేటాయించారని పేర్కొన్నారు. దీని ద్వారా ప్రత్యేకంగా గస్తీని నిర్వహించి తమిళనాడు నుంచి అక్రమ బోట్ల చొరబాటు నుంచి రక్షించనున్నారన్నారు. నెల్లో పది రోజుల పాటు ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని తీర ప్రాంతాల్లో గస్తీని నిర్వహించనున్నారని వెల్లడించారు.

విదేశీ మద్యం బాటిళ్ల పట్టివేత

కోవూరు: విదేశాల నుంచి సముద్ర మార్గం మీదుగా చెన్నై తీసుకొచ్చి.. అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు తరలిస్తున్న 43 లీటర్ల మద్యం బాటిళ్లను కోవూరు సమీపంలో ఎస్‌ఈబీ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఎస్‌ఈబీ సీఐ నరహరి వివరాల మేరకు.. చెన్నైలోని రెడ్‌హిల్స్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న శ్రీకృష్ణా ట్రావెల్స్‌లో పనిచేసే ఏడుకొండలు, మేరీబాబు, మధు (డ్రైవర్లు, క్లీనరు) వీటిని తరలిస్తుండగా పట్టుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కులగణనకు నాంది



అన్ని వర్గాల అభ్యున్నతికి బాటలు వేయాలనే మహోన్నత ఆశయంతో కులగణన ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 27 నుంచి డిసెంబర్ మూడు వరకు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నారు. ఈ క్రమంలో పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలోని ఆత్మకూరును ప్రభుత్వం ఎంపిక చేసింది. కులసంఘాలు, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశాలను ఇప్పటికే నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించింది.





కులగణనపై నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ వికాస్ మర్మత్, హాజరైన అధికారులు (ఫైల్)

రాష్ట్ర ప్రభుత్వ చరిత్రాత్మక నిర్ణయం

- ఈ నెల 27 నుంచి డిసెంబర్ మూడు వరకు నిర్వహణ
- పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల ప్రణాళిక
- ఇప్పటికే కుల సంఘాల నుంచి అభిప్రాయాల సేకరణ
- తాజాగా మార్గదర్శకాల విడుదల

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఎన్నో ఏళ్ల అనంతరం రాష్ట్రంలో కులగణన ప్రక్రియను మరోసారి చేపట్టనున్నారు. కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలనే లక్ష్యంతో మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ప్రక్రియను చేపట్టాల్సిన తీరు.. సేకరించాల్సిన అంశాలను అందులో పేర్కొంది.

వివరాల సేకరణ ఇలా..

- ఏ సామాజికవర్గానికి చెందిన వారు ఎంత మంది ఉన్నారో తెలుసుకొని.. వారికి సంక్షేమ ఫలాలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో సమగ్ర కులగణనను చేపడుతున్నారు.
- ఇందులో భాగంగా సదరు కుటుంబానికి సంబంధించిన సమగ్ర వివరాలను సేకరించనున్నారు. మొదట ఆ కుటుంబం నివసిస్తున్న జిల్లా.. మండలం.. గ్రామ వివరాలను సేకరిస్తారు. అనంతరం కుటుంబ పెద్ద.. ఇంటి చిరునామా.. గృహ వివరాలు.. ఎంత మంది నివసిస్తున్నారనే వివరాలను నమోదు చేయనున్నారు. ఈ – కేవైసీకి లోబడి కుటుంబసభ్యుల వివరాలను నమోదు చేస్తారు.
- ప్రతి వ్యక్తి పేరు.. వయస్సు.. భూమి (వ్యవసాయ, వ్యవసాయేతర).. ఇంట్లోని పశువులు.. వృత్తి.. అన్ని రకాలుగా వచ్చే ఆదాయం.. కులం.. ఉపకులం.. మతం.. విద్యార్హత.. నివాసం ఉండే ఇల్లు.. మంచినీటి సదుపాయం.. టాయ్‌లెట్లు.. తదితర వివరాలను సేకరించాల్సి ఉంటుంది.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- సచివాలయ ఉద్యోగి, గ్రామ వలంటీర్ కలిసి ఇంటింటి సర్వేను కచ్చితంగా చేపట్టాలి. సర్వే ప్రారంభం నుంచి పూర్తయ్యేంత వరకు ఒకే మొబైల్ ఫోన్‌ను వినియోగించాలి. సర్వేకు కుటుంబసభ్యుల నుంచి అనుమతిని తప్పక పొందాలి
- ఇప్పటికే బయోమెట్రిక్, ఐరిస్, ఫేషియల్ గుర్తింపు పరికరాలను అందించారు. మొబైల్ అప్లికేషన్‌లో స్క్రీన్ షాట్లు, వీడియో రికార్డింగ్‌లను అనుమతించరు.
- సర్వే ప్రక్రియ.. సాంకేతిక అంశాలపై మాస్టర్ శిక్షకులు అవగాహన కలిగి ఉండాలి. సందేహాలుంటే నివృత్తి చేసుకొని.. మండల, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలి.
- జిల్లా స్థాయిలో టెక్నికల్ నోడల్ అధికారి, సహాయాధికారులను నియమించారు. సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు అధిగమించేందుకు వీరు సాయం చేయనున్నారు. ప్రత్యేక యాప్ ద్వారా డేటాను ఎంట్రీ చేయనున్నారు.
- కార్యదర్శులను క్లస్టర్ల వారీగా విభజించి వారికి వలంటీర్లను అనుసంధానం చేస్తున్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, తహసీల్దార్, ఎంపీడీఓ తదితర మండల స్థాయి అధికారులను భాగస్వాములను చేస్తున్నారు. డివిజన్, జిల్లా అధికారుల పర్యవేక్షణలో వలంటీర్ అప్లికేషన్ ద్వారా సర్వేను నిర్వహించనున్నారు.
- ఎనిమిదేళ్ల కంటే తక్కువ వయస్సున్న పిల్లల వివరాలనూ సేకరించాలి. ఒక్కరే ఇంట్లో ఉండి.. కుటుంబం మొత్తం చనిపోయి ఉంటే సర్వే నిర్ధారణ కోసం సెక్రటేరియట్ ఉద్యోగి ఈ – కేవైసీని తప్పక ఇవ్వాలి.

అపోహలొద్దు

కులాల వారీగా జనాభా.. సామాజిక.. విద్య.. ఆర్థిక పరిస్థితులను తెలుసుకొని అర్హులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించేందుకు కులగణన దోహదపడుతుంది. ఈ ప్రక్రియపై కొందరు అపోహపడుతున్నారు. ఆధార్ తదితర వివరాలను వెల్లడిస్తే పథకాలను తొలగిస్తారనే వదంతులు వ్యాప్తి చెందుతున్నాయి. ఇలాంటి వాటికి ఆస్కారం లేదు. యాప్‌లో నమోదు చేసే సమాచారం పూర్తి భద్రత, గోప్యతతో ఉంటాయి. కులగణనను పక్కాగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టాం.

– కూర్మనాథ్, జేసీ

నేటి ‘జగనన్నకు చెబుదాం’ వాయిదా

నెల్లూరు (దర్గామిట్ట): దుత్తలూరులో శుక్రవారం నిర్వహించాల్సిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని వాయిదా వేశామని కలెక్టర్ హరినారాయణన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని పరిపాలన కారణాల రీత్యా వాయిదా వేశామని, తదుపరి ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామన్నారు.

తహసీల్దార్ల బదిలీ

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ఇద్దరు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ కార్యాలయం గురువారం ఒక ప్రకటనను విడుదల చేసింది. గతంలో ఆత్మకూరు తహసీల్దార్‌గా పనిచేసిన లక్ష్మీనరసింహాన్ని ఏఎస్‌పేటకు.. కొండాపురం తహసీల్దార్‌గా వ్యవహరించిన హుస్సేన్‌ను కావలి ఆర్డీఓ కార్యాలయ ఏఓగా బదిలీ చేశారు.

టీ - 20 టోర్నీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): టీ – 20 క్రికెట్ టోర్నీకి ఔత్సాహిక క్రీడాకారుల నుంచి ఎంట్రీలను ఆహ్వానిస్తున్నామని క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డీఎస్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంట్రీ ఫీజుగా రూ.ఐదు వేలను నిర్ణయించామని చెప్పారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు తమ క్రికెట్ క్లబ్ లెటర్ హెడ్‌పై 15 క్రీడాకారుల పేర్లను రాసి ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని ఎన్డీసీఏ కార్యాలయంలో డిసెంబర్ ఐదులోపు అందజేయాలని కోరారు. వివరాలకు 83285 36679, 94414 44796 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉదయగిరి సబ్ రిజిస్ట్రార్‌గా విజయరాణి



నెల్లూరు సిటీ: ఉదయగిరి రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ సబ్ రిజిస్ట్రార్‌గా విజయరాణిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో బాధ్యతలను గురువారం ఆమె స్వీకరించారు.

పేదల అభ్యున్నతే సీఎం లక్ష్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ
- వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా నిధుల విడుదల
- జిల్లాలో 486 మందికి రూ.3.87 కోట్ల లబ్ధి



నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ హరినారాయణన్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు (దర్గామిట్ట): బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి నిరంతరం పాటుపడే ఏకైక వ్యక్తి సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కొనియాడారు. వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకంలో భాగంగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నగదును జమ చేసే కార్యక్రమాన్ని తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో సీఎం గురువారం ప్రారంభించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు నమూనా చెక్కును కలెక్టర్ హరినారాయణన్, జెడ్పీ చైర్‌పర్సన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆర్థిక స్తోమత లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికులు తమ పిల్లల వివాహాలను గౌరవప్రదంగా చేయాలనే ఉద్దేశంతో వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. నాలుగో విడతగా జిల్లాలోని 486 మందికి రూ.3.87 కోట్లను వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారని వెల్లడించారు. డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి రమేష్, ఐటీడీఏ పీఓ మందా రాణి పాల్గొన్నారు.

మాలాంటి పేదలకు వరం



ఆగస్టు 30న మాకు వివాహమైంది. వలంటీర్, సచివాలయ సిబ్బంది ద్వారా వైఎస్సార్ కల్యాణమస్తు పథకానికి దరఖాస్తు చేసుకున్నాం. ఈ నిధులు మంజూరయ్యాయని తెలిసి చాలా సంతోషపడ్డాం. రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. మాలాంటి పేదలకు సాయం చేస్తున్న జగనన్నకు రుణపడి ఉంటాం.

– అన్నాబత్తిన సాయిభరత్, ఉమా, విలుకానుపల్లి, పొదలకూరు

పేదోళ్ల ఇంటి బిడ్డ జగనన్న



మాలాంటి పేదోళ్లకు ప్రభుత్వం అండగా ఉంటోంది. పేదింటి ఆడపిల్లల వివాహాలు తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. పేదరికం నుంచి బయటపడి సమాజంలో గౌరవప్రదంగా బతకగలమనే ఆశ కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– సాదిక్ అలీ, యాస్మిన్, నెల్లూరు

ఎన్నికలకు నోడల్ అధికారుల నియామకం

నెల్లూరు(దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి 17 మంది నోడల్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ హరినారాయణన్ ఉత్తర్వులను గురువారం జారీ చేశారు.

- ఓటర్లకు అవగాహన కార్యక్రమాల నిర్వహణ: డీఆర్డీఏ పీడీ
- మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్: డీఈఓ, సీపీఓ, ఎన్‌ఐసీ జిల్లా ఇన్ఫర్మేటిక్స్ అధికారులు
- పోలింగ్ అధికారులు, సిబ్బందికి శిక్షణ: తెలుగుగంగ (రాపూరు) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నుడా వైస్ చైర్మన్
- పోలింగ్ సామగ్రి నిర్వహణ: జిల్లా సహకార శాఖాధికారి, మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్
- రవాణా, నిర్వహణ: డీటీసీ, జిల్లా ప్రజా రవాణాధికారి
- కంప్యూటరైజేషన్, ఐటీ నిర్వహణ: జిల్లా ఇన్ఫర్మేటిక్స్ అధికారి (ఎన్‌ఐసీ), ఈ – డిస్ట్రిక్ట్ మేనేజర్
- శాంతిభద్రతలు, నిఘా పర్యవేక్షణ, భద్రత ప్రణాళిక: డీఆర్వో, ఏఎస్పీ
- ఈవీఎంల నిర్వహణ: పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ – 2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
- ఎన్నికల ప్రవర్తన నియామవళి: జెడ్పీ సీఈఓ
- ఎన్నికల వ్యయ పర్యవేక్షణ: జిల్లా ఆడిట్ అధికారి
- బ్యాలెట్ పేపర్స్, పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ నిర్వహణ: డ్వామా పీడీ
- మీడియా నిర్వహణ: జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి
- కమ్యూనికేషన్ ప్రణాళిక నిర్వహణ: ఐటీడీఏ పీఓ
- ఓటర్ల జాబితా తయారీ: పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్
- ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం, ఓటరు హెల్ప్‌లైన్: జిల్లా పంచాయతీ రాజ్ అధికారి
- ఎన్నికల పరిశీలకుల కార్యక్రమాల సమన్వయ విధులు: జిల్లా అటవీ శాఖ అధికారి
- సైబర్ సెక్యూర్టీ: జిల్లా ట్రైనింగ్ సెంటర్ డీఎస్పీ

పాడి రైతులు జాగ్రత్తగా ఉండాలి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాడి రైతులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా పశువైద్యశాఖ అధికారి మహేశ్వరుడు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న చోట పశువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని చెప్పారు. జిల్లాలోని పాడి రైతులకు పశు సంరక్షణ కార్డుల పంపిణీని ప్రారంభించామని తెలిపారు. ఇప్పటికే పది వేలకు పైగా కార్డులను పంపిణీ చేశామని చెప్పారు. మొత్తం రెండు లక్షల కార్డుల కార్డులను పంపిణీ చేయనున్నామని వెల్లడించారు. మూగజీవాలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా టీకాలను ఉచితంగా వేస్తున్నామని తెలిపారు.

ఆశయం ముందు.. వైకల్యం చిన్నదై



బెంగళూరులో నిర్వహించిన పోటీల్లో యాదగిరి

- రైలు ప్రమాదంలో కాళ్లు కోల్పోయి..
- మనోధైర్యంతో అంతర్జాతీయ పారా గేమ్స్‌కు అర్హత
- శభాష్ అనిపించుకుంటున్న యాదగిరి

పదో తరగతిని 2004లో పూర్తి చేసి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎన్నో ప్రణాళికలు రూపొందించుకున్నారు. అయితే ఆ కలలను కల్లలు చేస్తూ విధి వింత నాటకమాడింది. రైలు ప్రమాదంలో తన రెండు కాళ్లను కోల్పోయినా.. మొక్కవోని ఆత్మవిశ్వాసంతో అంతర్జాతీయ పారా స్పోర్ట్స్ గేమ్స్‌కు అర్హత సాధించిన మైపాడుకు చెందిన యాదగిరి పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. దాతలు చేయూతనందిస్తే మరింత ఉన్నతంగా రాణించగలనని పేర్కొంటున్నారు.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని మైపాడులో మత్స్యకార కుటుంబానికి చెందిన యాదగిరి జీవితం అందరిలాగే సాఫీగా సాగేది. 2004లో పదో తరగతి పూర్తి చేశారు. అదే ఏడాది నవంబర్‌లో రైలెక్కుతూ జారిపడటంతో తన రెండు కాళ్లను పోగొట్టుకున్నారు. స్థానికుడు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి సహకారంతో జైపూర్ కృత్రిమ కాళ్లను అమర్చుకొని.. మనోధైర్యంతో 2014లో ఎంబీఏ పూర్తి చేశారు.

పారా స్పోర్ట్స్‌లో ప్రతిభ

వైకల్యం తన ఆశయానికి ఏ మాత్రం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో పారా స్పోర్ట్స్ గేమ్స్ వైపు యాదగిరి ఆకర్షితులయ్యారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రోలో పతకాలను సాధించారు. హరియాణాలో 2018లో నిర్వహించిన జాతీయ పారా గేమ్స్‌లో షాట్‌పుట్‌లో తృతీయ స్థానాన్ని పొందారు. 2019, 20లో నిర్వహించిన జాతీయ స్థాయి పారాగేమ్స్‌లో ప్రాతినిధ్యం వహించారు. బెంగళూరులో ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని డిస్కస్ త్రోలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని దక్కించుకున్నారు. దీంతో థాయ్‌లాండ్‌లో డిసెంబర్‌లో నిర్వహించనున్న ప్రపంచ పారా గేమ్స్‌లో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు అర్హత సాధించారు. కాగా ఆర్థిక స్తోమత అంతంతమాత్రంగా ఉన్న యాదగిరి దాతల సాయం కోసం ఎదురు చూస్తున్నారు. సాయం చేయాలనుకునే వారు 99899 04714 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.

సత్తా చూపుతా



ఎన్నో కష్టాలు పడి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించా. పోటీల్లో పాల్గొనే ఆర్థిక స్తోమత నాకు లేదు. ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నా. భార్య, ఇద్దరు పిల్లలున్నారు. జీవనమే కష్టంగా ఉంది. ఆర్థికంగా సాయం చేస్తే ప్రపంచ పోటీల్లో పాల్గొని దేశానికి మంచి పేరు తెస్తాననే నమ్మకం ఉంది.

– కటారి యాదగిరి, పారా స్పోర్ట్స్ క్రీడాకారుడు

అనంతసాగరం చెరువు కింద నాట్లు వేస్తున్న రైతులు



వర్షాలతో అన్నదాతలకు ఊరట

నెల్లూరు(దర్గామిట్ట): ఈశాన్య రుతుపవనాల కారణంగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో ఆందోళనలో ఉన్న మెట్ట రైతులకు ఈ వర్షాలు ఊపిరినిచ్చాయి. జిల్లాలో నాలుగు రోజులుగా కురుస్తున్న వానలతో నారుమడులకు ఢోకా లేకుండాపోయింది. జిల్లాలోని 19 మండలాల్లో ఒక మోస్తరు నుంచి జడివానలు కురిశాయి. వరుణుడి కరుణతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాగు ఊపందుకుంది. కాగా నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి.

జిల్లాలో 14.4 మిల్లీమీటర్ల వర్షపాతం

జిల్లాలో గురువారం సాయంత్రానికి 14.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముత్తుకూరులో 43.2, కందుకూరులో 39.4, ఉలవపాడులో 37.2, దుత్తలూరులో 32.4, వలేటివారిపాళెంలో 30, సీతారామపురంలో 27.8, వింజమూరులో 27.6, మనుబోలులో 25.6, ఇందుకూరుపేటలో 25.4, ఉదయగిరిలో 22.4, బుచ్చిరెడ్డిపాళెంలో 21.2, వరికుంటపాడులో 19.8, కోవూరులో 19, పొదలకూరులో 16.4, వెంకటాచలంలో 13.6, తోటపల్లిగూడూరులో 11.6, సైదాపురంలో 10.6, సంగంలో 10.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

క్లుప్తంగా

కేంద్ర పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(దర్గామిట్ట): కేంద్ర ప్రభుత్వం ప్రకటించే ఉత్తమ పర్యాటక గ్రామం, ఉత్తమ హోమ్ స్టే విలేజ్ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వ్యవసాయ, బాధ్యతాయుత, వారసత్వ, కళారంగ గ్రామాలు, శక్తివంతమైన గ్రామాలు, కమ్యూనిటీ ఆధారిత, ఆరోగ్య రంగ పర్యాటకాలకు సంబంధించి దరఖాస్తునకు 24 వేల జనాభా మించని గ్రామాల వారు డిసెంబర్ 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బెస్ట్ రూరల్ టూరిజం విలేజ్‌స్‌గా ఎంపికైన వాటికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 91211 44110, 91549 89719, 99087 85777నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జర్నలిస్టులకు నివేశన స్థలాలు

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు కేటాయించే నివేశన స్థలాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైందని కలెక్టర్ ఎం హరినారాయణన్ తెలిపారు. జిల్లాలోని వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తూ ప్రస్తుత సంవత్సరానికి అక్రిడిటేషన్ కలిగిన అర్హులైన జర్నలిస్టులకు హౌసింగ్ స్కీం కింద ఇళ్ల స్థలాల మంజూరుకు ప్రభుత్వం జీఓ నంబర్ 535 ద్వారా వీలు కల్పించిందని చెప్పారు. 2024 జనవరి 6వ తేదీలోగా అర్హులైన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం తమ వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటి స్థలం విలువలో 60 శాతం ప్రభుత్వం, 40 శాతం జర్నలిస్టులు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: రూ.90
లేయర్ (లైవ్)	: రూ.105
బ్రాయిలర్ చికెన్	: రూ.168
స్కిన్‌లెస్ చికెన్	: రూ.188
లేయర్ చికెన్	: రూ.178

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.45
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.8



విద్యుత్ అధికారులకు షాక్

సేవల్లో నిర్లక్ష్యంపై ఏపీఈఆర్సీ కొరడా

- సిబ్బందికి రూ.4,96,950 జరిమానా
- వేతనాల్లో నుంచి కోతకు ఆదేశం



నెల్లూరులోని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా ప్రధాన పరిపాలనా కార్యాలయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ శాఖ పొరపట్టిక ప్రకారం నిర్ణీత గడువులోగా వినియోగదారులకు సేవలు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యుత్ సిబ్బందిపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) కొరడా ఝళిపించింది. క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ఏఈ స్థాయి అధికారి వరకు భారీగా జరిమానా విధించింది. ఆ మొత్తాన్ని వేతనాల్లో కోత వేసి వినియోగదారులకు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది.

ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్కిల్ పరిధిలో ఆత్మకూరు, గూడూరు, కావలి, నాయుడుపేట, నెల్లూరు రూరల్, నెల్లూరుటౌన్ డివిజన్లు ఉన్నాయి. ఆయా డివిజన్ల పరిధిలో నూతన సర్వీసులు ఇవ్వడంలో జాప్యం, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ (విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై వచ్చే ఫిర్యాదులు), విద్యుత్ పనుల అంచనాలో జాప్యం, విద్యుత్‌లైన్లు, స్తంభాల ఏర్పాటు, విద్యుత్ మీటర్ల మార్పు, అధిక విద్యుత్ బిల్లులు, తదితర సమస్యలను పొరపట్టిక ప్రకారం నిర్దేశించిన సమయానికి విద్యుత్ సిబ్బంది పరిష్కరించకపోవడాన్ని గుర్తించింది ఏపీఈఆర్సీ. గత ఏడాది 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు ఏడాది కాలంలో సేవల్లో జరిగిన జాప్యాన్ని గుర్తించి అందుకు బాధ్యులైన విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్లతో పాటు సిబ్బందికి

డివిజన్	జరిమానా
నెల్లూరు టౌన్	రూ.1,36,250
నెల్లూరు రూరల్	రూ.1,08,700
కావలి	రూ.1,05,450
ఆత్మకూరు	రూ. 16,050
గూడూరు	రూ. 56,250
నాయుడుపేట	రూ. 74,250
మొత్తం	రూ.4,96,950

రూ.4,96,950 జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని బాధ్యుల జీతాల్లో కోత విధించాలని సంబంధిత ఉన్నతాధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. కోత వేసిన మొత్తాన్ని విద్యుత్ సేవల్లో జాప్యానికి గురైన సదరు వినియోగదారులకు అందజేయాలని ఆదేశించింది.

బాధ్యతగా పనిచేయాలన్నదే ఉద్దేశం



పొరపట్టిక ప్రకారం విద్యుత్ వినియోగదారులకు నిర్ణీత కాలంలో సేవలు అందించాలి. అయితే విద్యుత్ సిబ్బంది సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించడాన్ని గుర్తించిన ఏపీఈఆర్సీ అపరాధ రుసుం విధించింది. ఈ మొత్తాన్ని క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది జీతాల్లో కోత విధించింది. విద్యుత్ సిబ్బంది బాధ్యతగా పనిచేయడమే ఏపీఈఆర్సీ ప్రధాన ఉద్దేశం.

– విజయన్, ఎస్ఈ, ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

రూరల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 27వ డివిజన్ రిత్విక్ లేఅవుట్‌లో రూ.76 లక్షల వ్యయంతో చేపట్టనున్న పార్కు, రోడ్ల నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ ఇప్పటి వరకు డివిజన్ పరిధిలో కోటి రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలు అమలు చేసి గడప గడపకు చేరుస్తున్నారని తెలిపారు. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు జమ చేయడం గర్వించదగిన విషయమన్నారు. టీడీపీ హయాంలో ఏ మాత్రం అభివృద్ధి, సంక్షేమం జరగలేదన్నారు. రూరల్ నియోజకవర్గ అభివృద్ధి విషయంలో టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు అర్థరహితమన్నారు నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందడంతో పాటు విద్యాబోధన మెరుగుపడిందన్నారు. ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఆరోగ్య భరోసా లభించిందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సచివాలయాల ద్వారా అవినీతికి ఏమాత్రం తావులేకుండా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని తెలిపారు. ఎన్నికల హామీలను వంద శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ప్రజలు ఆదరించాలని కోరారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నగర మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రైల్వేబోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, డివిజన్ పార్టీ ఇన్‌చార్జి సుబ్బారెడ్డి, నాయకులు పెంచల్‌రెడ్డి, హరిబాబుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి శిలాఫలకాన్ని ఢీకొన్న కారు

- నలుగురికి స్వల్ప గాయాలు



ప్రమాదానికి గురైన కారు

వరికుంటపాడు: వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి శిలాఫలకాన్ని ఢీకొని చెట్లలోకి దూసుకెళ్లడంతో నలుగురు స్వల్పంగా గాయాలపాలయ్యారు. ఈ ఘటన గురువారం వేకువజామున వరికుంటపాడు సమీపంలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల మేరకు..అనంతపురం నుంచి ప్రకాశం జిల్లా కనిగిరికి వెళ్తున్న కారు వరికుంటపాడు సమీపంలోకి వచ్చేసరికి డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న శిలాఫలకాన్ని ఢీకొని చెట్లలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో కారులోని నలుగురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కరటంపాడులో మాట్లాడుతున్న ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కరటంపాడు సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. గ్రామ సచివాలయాల ఏర్పాటు ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకొచ్చారని వివరించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో 70 వేల ఎకరాలకుపైగా భూములను డీఫారం పట్టాలు, నోషనల్ ఖాతాలు, తదితర సమస్యలను పరిష్కరించి రైతులకు హక్కులు కల్పించామని వివరించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ బీమా కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. సచివాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కరటంపాడు బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర, ఎంపీటీసీ ఖాసీంసా, ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, ఏఓ శ్రీనివాసులు, ఆత్మకూరు మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, కౌన్సిలర్ కామాక్షయ్య నాయుడు, జమీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ధనాల రమేష్‌నాయుడు, ఎండీ మహమ్మద్ రఫీ, నెట్టెం పిచ్చయ్య, ఖాసీంఖాన్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసకారి



వలంటీర్లకు నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు ఓ మోసకారి అని, ప్రజలను నమ్మించి మోసం చేయడం ఆయనకు అలవాటేనని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని దామేగుంటలో గురువారం నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టోలో నవరత్నాలు మాత్రమే చెప్పి 33 పథకాలను అమలు చేశారని తెలిపారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు, మిగిలినప్పుడు ప్రజలంతా ఒక్కటేనని నమ్మిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని కొనియాడారు. కుల, మత, వర్గాలు, పార్టీ పట్ల పక్షపాతం చూపకుండా సంక్షేమ పథకాలందించిన గొప్ప ముఖ్యమంత్రి అని అభివర్ణించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జగన్ రూపొందించిన అద్భుత సృష్టి అన్నారు. ఎమ్మెల్యేలు ప్రతి గడపకు వెళ్లి ఏం కావాలో అడగడం గతంలో ఎప్పుడూ జరగలేదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలందాలంటే జన్మభూమి కమిటీల ఆశీర్వాదం తీసుకోవాల్సి ఉండేదని, వారు లంచాలు వసూలు చేయనిదే ఏ ఒక్క పథకం ఇచ్చేవారు కాదన్నారు. ఎన్నికలప్పుడు మాయమాటలు చెప్పి ఆ తరువాత హైదరాబాద్‌లో తిష్ట వేయడం టీడీపీ నేతలకు అలవాటేనన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడిచిన నాలుగున్నరేళ్లుగా నేతలు, అధికారులు ప్రజల్లోనే ఉన్నారని గుర్తుచేశారు. ప్రజలు ఇబ్బంది పడకూడదని పరితపించే ముఖ్యమంత్రి జగన్ అన్నారు. అందువల్లే సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజల వద్దకే పాలన తెచ్చారన్నారు. రాష్ట్రానికి ప్రజల కష్టసుఖాలను పంచుకునే ముఖ్యమంత్రి కావాలా లేక ఎన్నికల సమయంలో డబ్బుతో వచ్చే ముఖ్యమంత్రులు కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. మరో నాలుగు నెలల్లో ఎన్నికలు ఉండడంతో బాబు,, పవన్ ప్రజలపై ఎక్కడ లేని ప్రేమ ఒలకపోస్తూ వస్తున్నారన్నారు. అలాంటి వారిని నమ్మితే ప్రజలే నష్టపోతారన్నారు. మనకి ఎవ్వరు మంచి చేశారో గుండెలపై చేయి వేసుకుని ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సచివాలయంలో గ్రామానికి అందిన రూ.12.44 కోట్ల సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. 11మంది వలంటీర్లకు నియామక పత్రాలను అందజేశారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, జెడ్పీటీసీ పసుపులేటి సరోజనమ్మ, ఎంపీపీ గాలి జ్యోతి, సర్పంచ్ చిమటా హరిత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సచివాలయాల మండల కన్వీనర్ కొండా శ్రీనివాసులురెడ్డి,నాయకులు చిమటా శేషగిరి,మల్లికార్జున, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం

- ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆరు నెలలకే ఘటన
- భర్తను విచారిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఆరునెలలు గడవక ముందే భర్త అనుమానం పెంచుకుని ఆమెను వేధించడం ప్రారంభించాడు. వేధింపులు తాళలేక వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మూలాపేట యాదవవీధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు...ఫత్తేఖాన్‌పేటకు చెందిన సాయిశిరీష(24) మూలాపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న సమయంలో అదే స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మూలాపేట యాదవవీధికి చెందిన మోహన్‌కృష్ణతో పరిచయం అయింది. అది కాస్తా ప్రేమగా మారింది. ఇద్దరి కులాలు వేరైనప్పటికీ అందర్ని ఎదిరించి వారు ఆరునెలల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. ఉపాధ్యాయవృత్తితో పాటు మోహన్‌కృష్ణ తన కులవృత్తిని చేసుకోసాగాడు. కొంత కాలం వారి కాపురం సజావుగా సాగింది. మోహన్‌కృష్ణ భార్యపై అనుమానం పెంచుకున్నాడు. దీంతో వారి మధ్య కలతలు చోటుచేసుకున్నాయి. పలుమార్లు ఇద్దరూ గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో ఈ నెల 22న దంపతుల నడుమ తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. గురువారం ఉదయం మోహన్‌కృష్ణ కులవృత్తి నిమిత్తం బయటకు వెళ్లారు. రెండుసార్లు ఆయన భార్యకు ఫోన్ చేసినా ఆమె లిఫ్ట్ చేయలేదు. పనిముగించుకుని ఇంటికొచ్చిన మోహన్‌కృష్ణ తలుపు ఓరగా వేసి ఉండడంతో లోనికి వెళ్లి చూడగా సాయిశిరీష ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. దగ్గరకు వెళ్లి చూడగా ఆమె అప్పటికే మృతి చెంది ఉంది. దీంతో జరిగిన విషయాన్ని మృతురాలి బాబాయి ద్వారా ఆమె కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. సాయిశిరీష ఆత్మహత్యకు భర్తే కారణమని మృతురాలి తండ్రి మునికుమార్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగర డీఎస్పీ డి శ్రీనివాసరెడ్డి, చిన్నబజార్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ కళ్యాణ్‌రావు, ఎస్సై సైదులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మోహన్‌కృష్ణను విచారిస్తున్నారు. శుక్రవారం సాయిశిరీష మృతదేహానికి తహసీల్దార్ శవపంచనామా నిర్వహించనున్నారు. అనంతరం ప్రభుత్వ వైద్యులు పోస్టుమార్టం చేయనున్నారు.